తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

## -ప్రవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిన మార్కెట్



తిరుపతిరూరల్, అక్టోబర్ 5 ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ముత్యాలరెడ్డిపల్లిలో ఉన్న కూరగాయల మార్కెట్ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపయోగకరంగా ఉండటమే కాకుండా మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా కూరగాయల మార్కెట్ నిలయమైంది. నగర పరిధిలోని ఎంఆర్‌పల్లి వైకుంఠపురంలో రూ.52.68కోట్ల రుపాయలతో చిన్న, సన్నకారుల వ్యాపారుల కోసం కోసం 47 దుకాణాలను ఏర్పాటు చేసారు. ఈ మార్కెట్‌ను 2020న అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధులు అట్టహసంగా ప్రారంభించారు. మార్కెట్‌ను ఆరంభశూరత్వంగా మారిందే తప్ప ఏనాడు అన్ని షాపులలో కూరగాయల షాపులు ఏర్పాటు చేయలేదు. నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్, ప్రవేట్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. ఖాళీగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను టెండర్స్‌కు పిలిచి, షాపులను అద్దెకు ఇవ్వాల్సి ఉన్నా... నగరపాలక అధికారులు అటువంటి ఆలోచన చేయడం లేదనే విమర్శలు వెలువేత్తుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న మార్కెట్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది అనడంలో ఏలాంటి సందేహం లేదు. చీకటిపడితే మార్కెట్‌లో మందుబాబులకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న, సన్నకారుల వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన మార్కెట్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేసారు. ఈ కూరగాయల వినియోగం కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నగరపాలక సంస్థ అధికారులు చెప్పడంలో స్పష్ట లేదని స్థానికులు అంటున్నారు. మార్కెట్‌ను ఎప్పుడు పున:ప్రారంభిస్తారో తెలియదుగానీ, ప్రస్తుతం నెలకు రూ.700 రుపాయాలకు అద్దెకు ఇస్తున్నారని విశ్వసనీయ సమాచారం.

# విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు!

**- ఆదాయం ఆర్జించడమే లక్ష్యంగా పల్లె పల్లెలో బెల్టుషాపులు - క్వాటర్ బాటిల్‌పై రూ.20 నుండి రూ.50 అదనంగా విక్రయాలు - బెల్టుషాపులను పట్టించుకోని ఎక్సైజ్, పోలీసు అధికారులు**

చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం ఏరులైపారుతుంది. ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయాలు నిర్వహించడానికి 104 మద్యం షాపులకు లైసెన్సులు కేటాయించినప్పటికీ పల్లె పల్లెలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం షాపులు మినహా మరెక్కడా మద్యం విక్రయాలు చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేస్తున్నప్పటికీ ఆదాయ అర్జనే ధ్యేయంగా మద్యం దుకాణ వ్యాపారులు తమ వ్యాపారంను పల్లెలకు వ్యాప్తి చేసి లక్షలు ఆర్జిస్తున్నారు. మద్యం దుకాణాలు మినహా మరెక్కడైనా మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తీసుకోవాల్సిన పోలీసు, ఎక్సైజ్ శాఖలు మద్యం దుకాణ యాజమానులు ఇస్తున్న మామూళ్ళను ప్రసాదాలుగా తీసుకుని పల్లె ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారి జోలికి వెళ్ళడం లేదు. జిల్లాలోని ప్రతి పల్లెలో మద్యం దుకాణాల్లో లభ్యం అయ్యే ధర కంటే ఒక క్వాటర్ బాటిల్‌పై రూ.20 నుండి రూ.50 అధికంగా చెల్లిస్తే బెల్టుషాపుల్లోనే కావాల్సిన మేరకు అవసరమైన మద్యం లభ్యం అవుతుంది. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న మద్యం పాలసీలో మద్యం దుకాణ వ్యాపారులకు పెద్దగా లాభాలు వచ్చే అవకాశం లేదు. ఇది వరకు మద్యం దుకాణాలు నిర్వహించిన వ్యాపారులకు ప్రభుత్వం 25 నుండి 30 శాతం వరకు లాభాలు వుండేది. ప్రస్తుత విధానంలో మద్యం దుకాణదారులకు కేవలం 14 శాతం లాభం మాత్రమే వస్తోంది. మద్యం షాపుల ఖరారు లక్కీ డ్రాప్ పద్ధతిలో నిర్వహించడం, ఒక మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ప్రభుత్వానికి 2.05 లక్షల రూపాయల నాన్ రీఫండబుల్ దరఖాస్తు ఫీజు చెల్లించుకోవాల్సి రావడంతో ఈ సారి మద్యం దుకాణాల కోసం పోటీ పడిన వారి జేబులకు భారీగా చిల్లుపడింది. ఒక్క షాపు కోసం మద్యం వ్యాపారులు కనీసం ఒకొక్కరు 10 నుండి 20 వరకు దరఖాస్తులు చేసుకున్న వారు సైతం వున్నారు. మద్యం షాపు కేటాయించిన అనంతరం ఒక ఏడాదికి రెంటల్ ఫీజుగా 65 లక్షల రూపాయల మేరకు ప్రభుత్వానికి చెల్లించాలి. అంటే ప్రస్తుతం మద్యం షాపు కైవసం చేసుకున్న వ్యక్తులు 67 లక్షల రూపాయల మేరకు ప్రభుత్వానికి జమ చేయాల్సివుంటుంది. దీంతో పాటు షాపులో మద్యం విక్రయాలు చేయడానికి అవసరమైన మొత్తంను షాపు యాజమాని సమకూర్చుకోవాల్సివుంటుంది. ఒక మద్యం షాపు నిర్వహించాలంటే మద్యం షాపు యాజమాని కనీసం 20 లక్షల రూపాయల మేరకు మద్యం షాపులో స్టాక్ పెట్టుకోవాల్సి వుంటుంది. ఒకొక్క మద్యం షాపులో రోజుకు 2.5 లక్షల రూపాయల మేరకు మద్యం అమ్మకాలు జరిగితే ఆ షాపు దక్కించుకున్న వారికి కొంత లాభం ఆశించవచ్చు. ఒకవేళ ఈ ఒక్క షాపును కైవసం చేసుకోవడానికి మద్యం షాపు వ్యాపారి పది, పదిహేను దరఖాస్తులు చేసుకుని వుంటే అప్పటికే ఆ షాపు యాజమాని 20 నుండి 30 లక్షల రూపాయలు నష్టపోయివుంటాడు. అలాంటి వారికి ప్రస్తుతం మద్యం షాపుల్లో వస్తున్న లాభాలు ఏ మాత్రం సరిపోవు. మద్యం షాపుల్లో వ్యాపారం పెద్దగా వుండకపోవడంతో షాపు యాజమానులు పల్లె ప్రాంతాలకు బెల్టుషాపులు కేటాయించి పల్లెల్లోని మద్యం విక్రయాలు చేసి తమ షాపుల ద్వారా మద్యం విక్రయాలు అధికంగా జరిగేలా వ్యూహాలు రచించి అమలు చేస్తున్నారు. మద్యం షాపు యాజమాని బెల్టుషాపులకు ఒక క్వాటర్ బాటిల్‌పై రూ.10 అధికంగా ఇస్తే బెల్టుషాపు నిర్వాహకులు పల్లె ప్రాంతాల్లో ఒక బాటిల్‌పై రూ.20 నుండి రూ.50 అధికంగా పెట్టి విక్రయాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 104 మద్యం షాపులు వుండగా ఒక షాపులో రోజుకు 2.5 లక్షల రూపాయల మద్యం విక్రయాలు చేస్తే ఈ మొత్తంపై 14 శాతం ఆదాయం మద్యం షాపు యాజమానికి వస్తోంది. అంటే ఒక రోజుకు 2.5 లక్షల మద్యం అమ్మకాలు జరిగితే ఆ షాపు యాజమానికి 35 వేల రూపాయల ఆదాయం వస్తోంది. అంటే నెలకు ఒక మద్యం షాపు ద్వారా రూ.10.50 లక్షల రూపాయల ఆదాయం లభిస్తోంది. ఇందులో మద్యం షాపు అద్దె 25 వేల రూపాయలు, షాపులో విధులు నిర్వహించే సిబ్బంది జీతాలు 50 వేల రూపాయలు, మేనేజర్‌కు 20 వేల రూపాయలు, మద్యం డిపో నుండి మద్యం ట్రాన్స్‌పోర్టు ఖర్చులు, కరెంటు బిల్లులు, ఎక్సైజ్ శాఖకు నెలవారీగా 35 వేల రూపాయలు, పోలీసు శాఖకు నెలకు 20 వేల రూపాయలను మద్యం షాపు యాజమానులు కచ్చితంగా చెల్లించాల్సివుంటుంది. అంటే ఒక నెలకు ఒక మద్యం షాపు నిర్వహణ ఖర్చులు ఇంచుమించు 1.70 లక్షలు అవుతుంది. ఒక మద్యం షాపు రోజుకు రూ.2.5 లక్షల మద్యం విక్రయాలు జరిపితే అతనికి నెలకు రూ.10.50 లక్షల ఆదాయం వస్తోంది. ఇందులో రెంటల్ ఫీజు కింద నెలకు రూ.5.45 లక్షలు, షాపు నిర్వహణ ఖర్చులు రూ.1.70 లక్షలు కలిసి రూ.7.15 లక్షలు అవుతుంది. రూ.10.50 లక్షలులో రూ.7.15 లక్షలు పోతే రూ.3.35 లక్షలు మిగులుతుంది. ఇందులో 11 లక్షల రూపాయల మేరకు షాపు యాజమాని ముందుగానే రెంటల్ కింద ప్రభుత్వానికి జమ చేయడం, షాపులో మద్యం స్టాకు కోసం రూ.20 లక్షల వరకు పెట్టుబడిగా వుండటంతో ఈ మొత్తానికి వడ్డీ లెక్కవేస్తే మిగిలిన ఆదాయం అక్కడికక్కడ సరిపోతుంది. ఈ పరిస్థితుల్లో మద్యం వ్యాపారంను మరింత ఎక్కువ నిర్వహించాలని నిర్ణయిస్తున్న మద్యం దుకాణాల యాజమానులు పల్లెల్లో మరిన్ని బెల్టుషాపులు పెట్టించి విక్రయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మద్యం వ్యాపారుల పరిస్థితిని చూసి పోలీసు, ఎక్సైజ్ శాఖలు వారి నుండి నెలవారీ మామూళ్ళు తీసుకుని పల్లెల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపుల జోలికి వెళ్ళడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పల్లెల్లో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపులను పోలీసు, ఎక్సైజ్‌శాఖలు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.



# ముఖ్యమంత్రి పర్యటనకు లోప రహిత భద్రతా ఏర్పాట్లు



చంద్రగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: ఈ నెల 7న దివంగత మాజీ ఎంఎల్‌ఏ నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక కార్యానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారావారిపల్లి రాక నేపథ్యంలో లోప రహిత భద్రతా ఏర్పాట్లు చేయడంపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బ రాయుడు, జెసి శుభం బన్సల్ ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక భద్రతా అధికారులు, ఇంటలిజెన్స్, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ, హెల్త్, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులతో కలసి నారావారిపల్లిలో ముఖ్యమంత్రి కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను ఆదివారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాలలో చేపట్టవలసి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు అప్పటికప్పుడే అక్కడే ఆదేశాలిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా పూర్తి చేయడంలో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఆయా విభాగాల అధికారులు అప్రమత్తతో లోపాలను అరికట్టి సమర్ధవంతంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీలు రవిమనోహర్ ఆచారి (శాంతి భద్రతలు), నాగభూషణ్ రావ్ (క్రైమ్), వెంకటరాముడు (ఇంటలిజెన్స్), శ్రీనివాసరావ్ (సాయుధదళం), డిఎస్పీలు వెంకటనారాయణ (ఎస్‌బి), ప్రసాదరావు (చంద్రగిరి), సిఐలు,ఇంటలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.

**-నేడు నారావారిపల్లికి మంత్రి నారా లోకేష్**

తన పిన తండ్రి నారా రామ్మూర్తి నాయుడు సంవత్సరిక కార్యానికి ఒక రోజు ముందుగానే ఐటి మంత్రి నారా లోకేష్ సోమవారం సాయంత్రం నారావారిపల్లికి చేరుకోనున్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సతీమణి నారా భవనేశ్వరి సైతం రాత్రికి ఇక్కడికి చేరుకోనున్నారు. ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో అశువులుబాసిన డిసిఎంఎస్ చైర్మన్ దివంగా పల్లినేని సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులను లోకేష్ పరామర్శించేందుకు పనపాకం నారా లోకేష్ వెళ్ళనున్నారు.

# ఉద్యోగుల బకాయిలపై...ఉద్యమాల బాట తప్పదు!




ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గూడూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: ఉద్యోగుల బకాయిల చెల్లింపుల పై ప్రభుత్వం జాప్యం చేస్తే ఉద్యమాల బాట తప్పదని ఇయు రాష్ట్ర నాయకులు పలిశెట్టి దామోదర రావు, జివి నరసయ్యలు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇంకా నిర్లక్ష్యం చేస్తే ఉద్యగులకు ఉద్యామల శరణ్యమోతాయని ఆపరిస్థితి రాకుండానే ప్రభుత్వం చొరతీసుకొని ఉద్యోగులకు ఇచ్చిన హామిలు నెరవెర్చాలని లేదంటే ఉద్యమాల బాట పట్టక తప్పదని ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య అన్నారు. అలాగే ఉద్యోగుల బకాయిలు, పెండింగ్ డిఏలు, 11వ పిఆర్సీ 24 నెలలు బకాయిలు రిటైర్డు ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, సరండర్ లీవ్ల డబ్బులు ఇంకా చెల్లించక పోవడం వలన ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరులోని గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ ఉద్యోగుల భవనంలో, తిరుపతి జిల్లాకు చెందిన గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడ డిపోల ఏపిపిటిడి (ఆర్టీసి) ఎంప్లాయిస్ యూనియన్ సంయుక్త జనరల్ బాడీ సమావేశం వై.వి. నారాయణ అధ్యక్షతన జరిగింది. కూటమి నాయకులు ఇచ్చిన హామీలలో ముఖ్యమైన ఐఆర్ ప్రకటించడం, 12వ పిఆర్సీ కమిషన్ నియామకం వంటి అంశాలపై ఇప్పటికీ ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. రిటైర్డు ఉద్యోగుల బకాలు రావల్సిన అందుకోకుండానే చనిపోతున్నారని ఇది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని దామోదరరావు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మరో ముఖ్య అతిథి ఇ.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మాట్లాడుతూ ఆర్టీసి ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్తు స్కీమ్ (ఇ.హెచ్.యస్) ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అంతడంలేదని, ఆర్టీసి ద్వారానే పాత పద్ధతిలో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్యసౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈసమావేశంలో పాల్గొన్న ఇ.యు స్టెట్ డిప్యూటీ జెనరల్ సెక్రటరీ జి.నారాయణరావు, స్టేట్ వర్కింగు ప్రెసిడెంటు పి. సుబ్రమణ్యం రాజు, స్టేట్ అసిస్టెంటు సెక్రటరీ ఏ.మురుగమ్మ మాట్లాడుతూ ఆర్టీసి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల్లో 10,000 లోపు పెన్షన్ పొందుతున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలన్నారు. ఈ సమావేశంలో జోనల్ నాయకులు ఇ.విజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఇ.యు అధ్యక్షులు జీఆర్.చంద్ర, జిల్లా కార్యదర్శి వి.మస్తాన్ జిల్లా నాయకులు పి.సుబ్బారావు, కె.సి.రాజు, కె.వెంకటేషులు, ఏపిజేఏసి అమరావతి జిల్లా ఉమెన్ వింగు ప్రధాన కార్యదర్శి పి.పద్మజాతో పాటు గూడూరు,వెంకటగిరి, సూళ్లూరుపేట, వాకాడు డిపో అద్యక్ష, కార్యదర్శుల వై.వి నారాయణ, యస్.కె.జిలాని, డి.రాజగోపాల్, వై.వి.ప్రసాద్, సీనయ్య, కె.జయరాజ్, శ్రీనివాసులు అధిక సంఖ్యలో యూనియన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ. 73 కోట్ల నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధి పనులు

**-రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ**



గూడూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట మున్సిపాలిటీలపై సమీక్షిస్తున్న మంత్రి

గూడూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: రాష్టంలో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీరు సరఫరా చేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని దీని కొరకు గూడూరు మున్సిపాలిటీకి 73 కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. అమృత్ స్కీం ద్వారా రాష్టంలో పదివేల కోట్ల రూపాయలతో పలు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గూడూరు మున్సి మున్సిపాలిటీకి గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట మున్సిపాలిటీలపై సమీక్ష సమావేశం కొరకు పురపాలకశాఖ విచ్చేశారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మంత్రి నారాయణకు ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులను మంత్రికి పరిచయం చేశారు అనంతరం ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, విజయశ్రీ, కురుగోండ్ల రామకృష్ణతో మంత్రి మున్సిపాలిటీల అభివృద్ధి పెండింగులో ఉన్న పనులుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమృత పథకం ఎక్కడ అమలు కాలేదని ఇటీవల అమృత్ పథకంపై ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని తెలిపారు. పదివేల కోట్ల రూపాయల నిధులతో రాష్టంలో అన్ని మున్సిపాలిటీ అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడించారు ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతగా ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని ఉద్దేశంతో మున్సిపాలిటీలకు నిధులు కేటాయిస్తున్నామని గూడూరు మున్సిపాలిటీకి రూ. 73 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. తర్వాత గచ్చా డ్రైన్లు తొలగించి కాలువలు నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు అభివృద్ధికి గతంలో మంత్రిగా ఉన్నప్పుడు నారాయణ ఎంతో సహకారం అందించారని గూడూరు మున్సిపాలిటీ లో విలీనమైన గ్రామాలను తొలగించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే చెరువు కట్ట అభివృద్ధి పనులు ప్రారంభించడం జరుగుతుందని అభివృద్ధికి సహకారం అందిస్తున్న మంత్రి నారాయణకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణాభివృద్ధికి ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని మంత్రి నారాయణ సహకారంతో రోడ్లు, వీధిలైట్లు బ్యూటిఫికేషన్ చేసి పట్టణాన్ని అందంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, మున్సిపల్ కమిషనర్లు వెంకటేశ్వర్లు, ఫజులుల్లా, చిన్నయ్య, వెంకట్రామిరెడ్డి, నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, మట్టం శ్రావణి రెడ్డి, తీగల చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పాత,కొత్త కలయికతో... పార్టీలో సమన్వయలోపం !

**-జనసేనపార్టీ సీనియర్స్‌లో అంతర్గత విభేధాలు**



ప్రభాతవార్త-తిరుపతి:

తెలుగుదేశంపార్టీకి ప్రతిష్టాత్మకంగా, పటిష్టంగా మారిన తిరుపతి నియోజకవర్గంలో జనసేనపార్టీ ప్రవేశించడంతో ఈ పార్టీలోని పాత నాయకులు,కార్యకర్తలు ఎన్నికలకు ముందుపార్టీలో చేరిన కొందరు నేతల మధ్య సమన్వయ లోపించిందనేది పార్టీ శ్రేణుల్లో వినిపిస్తున్న అసంతృప్తులు. తిరుపతిలో కూటమి పార్టీ తరపున జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నా ఆ పార్టీలో జూనియర్స్, సీనియర్స్‌లో అంతర్గత విభేధాలు ప్రస్ఫుటమవుతున్నాయి. తిరుపతి నియోజకవర్గం తొలినుండి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. 1983లో ఎన్టీరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తొలిరోజుల్లోనే ఆయన తిరుపతి నుండి పోటీచేసి గెలిచారు. ఇక్కడి ఓటర్లు, ప్రజలు అప్పుడే టిడిపిని బలంగా ఆదరించారు. గుడివాడ నుండి గెలిచిన ఎన్టీఆర్ తిరుపతికి రాజీనామా చేశారు. అప్పట్లో ఉప ఎన్నికల్లోనూ టిడిపి తరపున పోటీచేసిన డాక్టర్ కత్తులశ్యామల ఎమ్మెల్యేగా గెలిచింది. ఆ తరువాత వరుసగా 1985,1989లో కాంగ్రెస్ పార్టీ తరపున మబ్బురామిరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. తిరిగి 1994లో తిరుపతిలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీచేసిన ఎ.మోహన్ ఎమ్మెల్యేగా ఓటర్లు ఆదరించారు. 1999 ఎన్నికల్లోనూ టిడిపి నుండి పోటీచేసిన చదలవాడ కృష్ణమూర్తిని తిరుపతి ఓటర్లు ఎమ్మెల్యేగా గెలిపించారు. 2004లో రాష్టంలో మారిన రాజకీయ పరిస్థితులు, పరిణామాలతో తిరుపతి లో కూడా కాంగ్రెస్ పార్టీని జనం ఆదరించి అప్పట్లో ఎం.వెంకటరమణను కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిపించారు. 2008లో సినీనటుడు చిరంజీవి ప్రజారాజ్యంపార్టీని స్థాపించి 2009 ఎన్నికల్లో తిరుపతి నుండి ఆయన పోటీచేశారు. తిరుపతి జనం చిరంజీవిని ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారు. అయితే కొన్ని అనివార్య పరిస్థితుల్లో పిఆర్‌పిని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో తిరుపతికి ఉప ఎన్నికలు అనివార్యమ య్యాయి. 2012 ఉప ఎన్నికల్లో వైసిపి తరపున భూమన కరుణాకర్‌రెడ్డిని జనం ఆదరించారు. 2014 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుండి వెంకటరమణ టిడిపిలో చేరి పోటీ చేయడంతో మళ్ళీ ఓటర్లు టిడిపికి పట్టంగట్టారు. ఆయన మృతితో ఆయన కుటుంబం నుండి సుగుణమ్మ టిడిపి ఎమ్మెల్యేగా గెలిచి ఓటర్లను ఆకట్టుకున్నారు. 2019 ఎన్నికల్లో మళ్ళీ వైసిపిని ఆదరించి కరుణాకర్‌రెడ్డిని ఎమ్మెల్యేని చేశారు. 2024 ఎన్నికలకు ముందు టిడిపి కూటమి పార్టీగా పోటీతో టిడిపి నేతలు సమర్ధులు లేరని, ధీటుగా పోటీచేసే నాయకుడుగా చిత్తూరు వైసిపి నుండి తిరుపతి జనసేన పార్టీలోకి వచ్చిన శ్రీనివాసులును కూటమి తరపున పోటీ చేయించారు. అయితే తిరుపతిలో 2014లోనే జనసేనకు డాక్టర్ హరిప్రసాద్, కిరణ్‌రాయల్,పగడాల మురళి, ఇలా కొందరు మాత్రమే ఉన్నారు. ప్రస్తుత పార్టీనేతల్లో పాతవాళ్ళు కొత్తగా చేరినవారితో ఇమడలేక సమన్వయంలేక పార్టీ బలోపేతానికి ఆటంకంగా మారిందని నేతల్లో అంతర్మథనం చెందుతున్నారు.

# ఉధృతంగా కౌండిన్య నదీ ప్రవాహం

**-నీట మునిగిన పంటపొలాలు**




పంట పొలాలపై కౌండిన్య నదీ జలాలు

పలమనేరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: పలమనేరు సమీపంలోని కౌండిన్య నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది పొడువునా నిర్మించిన చెక్‌డ్యాములన్నీ పొంగి పొరలుతున్నాయి. నదీ ప్రవాహం ఉప్పొంగి పరివాహక ప్రాంతంలో పంట పొలాలపై ప్రవహిస్తోంది. వరి, టమోటా, మల్బరీ, ఇతర కూరగాయల పంటలు నీట మునిగి పోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొబ్బరి చెట్లు మొదళ్ళు కోతకు గురై వేళ్ళు తేలి పోయాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటలు ధ్వంసమయ్యాయి. కౌండిన్య నది పలమనేరు నియోజకవర్గంలో దాదాపు 70 కి,మీల దూరం ప్రవహిస్తోంది. పెద్దపంజాణి, గంగవరం మండలాలతో పాటు పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్, సముద్రపల్లె, పెంగరగుంట, ముసలిముడుగు, కాలువపల్లె మీదుగా అటవీ ప్రాంతంలో నిర్మించిన కౌండిన్య ప్రాజెక్టు చేరుతోంది. పలమనేరు ప్రజల దాహార్తి తీరుస్తున్న కౌండిన్య ప్రాజెక్టు కూడా పూర్తి స్థాయి నిండిపోయి వృధాగా వెళ్ళే నీరు తమిళనాడు రాష్టం సైనిగుంట్ల వద్ద పాలారునదిపై నిర్మించిన మోర్ధాన ప్రాజెక్టు చేరుతోంది. ఈ పరిస్థితిలో నది ఉధృతంగా ప్రహిస్తుండడంతో పంట పొలాలు ధ్వంసమై తీవ్రంగా నష్టపోతున్నామని ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# శ్రీకాళహస్తి టిడిపిలో...ఆభద్రతా భావంలో కార్యకర్తలు

**ధర్మకర్తల మండలిలో మొండి చేయి మిగిలింది! -మున్సిపల్ ఎన్నికల్లో అయినా అవకాశం ఉంటుందా?**



శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకంలో అధికార తెలుగుదేశం పార్టీకి మొండిచేయి మిగిలింది.ఆశావహుల్లో తీవ్ర నిరాశ మిగిలింది. చైర్మెన్ పదవిని జనసేనకు కేటాయించిన కూటమి సభ్యుల విషయంలో కూడా నిరాశే మిగిల్చింది, ఉమ్మడి రాష్టంలోని వారికి అవకాశం కల్పించి రికార్డు సృష్టించారు. దాంతో స్థానిక అధికార పార్టీలో పదవుల అభద్రతా భావం చోటు చేసుకుంది. శాసనసభ్యుడు బుజ్జగించటానికి ప్రయత్నిస్తున్నా ఆశావహులు లోలోపల రగులుతున్నారు.దాంతో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అయినా పదవులు దక్కుతాయా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది.

**ఆది నుంచి పార్టీనే నమ్ముకున్న మా పరిస్థితి ఏమిటి?**

శ్రీకాళహస్తిలో నామినేటెడ్ పదవులకు సంబంధించి ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠత చోటు చేసుకుంది. 16 మంది సభ్యులు గల బోర్డులో స్థానికులకు కూటమిలోని బిజెపి,తెలుగుదేశం, జనసేన తరుపున కేవటం 7 గురికి మాత్రమే అవకాశం దక్కింది. ధర్మకర్తల మండలి నియామకంలో పాలకులు రాష్ట్ర స్థాయిలో అన్ని వర్గాలకు అవకాశం కల్పించారు. చైర్మెన్‌కు సంబందించి స్థానిక శాసనసభ్యుడు సుమారు ఏడాదిన్నరగా తనకు తోడుగా ఉంటూ కేసుల్లో ఇరుక్కున్న రంగినేని చెంచయ్యనాయుడుకే అంటూ పదే పదే బహిరంగంగా ప్రకటించారు.ఈ మేరకు అధిష్టానానికి జాబితా ఇచ్చారు.అలాగే బోర్డులో సభ్యులందరిని శ్రీకాళహస్తికి చెందిన వారికే ఇవ్వాలని కూడా కోరారు. ఈ మేరకు పలు మార్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువ మంత్రి నారాలోకేష్‌కు కూడా మొరబెట్టుకున్నారు. అయితే చైర్మెన్ గిరియే జనసేనకు ఇవ్వటమే కాకుండా సభ్యుల నియామకంలో కూడా రాష్ట్ర స్థాయి పార్టీ నాయకులకు అవకాశం కల్పించారు. గత ప్రభుత్వ హాయంలో ఇబ్బందులు ఎదుర్కొన్న కార్యకర్తలకు కనీసం నామినేటెడ్ పదవులు కూడా రాకుంటే ఎలా అని కుములుతున్నారు. గతంలో ఆశించిన వారే కాకుండా కొత్త వారుకూడా ఆశిస్తున్నారు. పార్టీని బలోపేతం చేసుకొనుటకు శాసనసభ్యుడు 'యువతకు' ప్రాధాన్యత ఇవ్వాలని ప్రణాళికలు రచించుకున్నారు.కానీ ధర్మకర్తల మండలి నియామకం షాక్‌గా మారింది.

**స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి:**

శ్రీకాళహస్తిలో నామినేటెడ్ పదవుల విషయంలో పార్టీ నిర్ణయాలు స్థానిక నాయకులకు మింగుడు పడటం లేదు.గ్రామాల్లో నాయకులు సర్పంచ్,ఎంపిటిసి పదవులపై పట్టణంలో కౌన్సిలర్లు, వైస్ చైర్మెన్,చైర్మెన్ పదవులపై ఆశలు పెంచుకుంటున్నారు. ఈనేపథ్యంలో 2014 నుంచి పార్టీలో ఎలాంటి పదవులు ఆశించకుండా సేవలందిస్తున్న భారత్ గ్యాస్ ఏజెన్సికి చెందిన జి.విజయ కుమార్ నాయుడుకే అవకాశం ఉంటుందని భావిస్తున్నా, శాసనసభ్యునితో సన్నిహితంగా మెలిగే మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్ కూడా ఆశిస్తున్నట్లు సమాచారం. కులాల సమీకరణలో తమ వారికి అవకాశం కల్పించాలని వత్తిడి తీసుకురానున్నట్లు తెలిసింది. పార్టీలో ఆది నుంచి శాసనసభ్యునితోనే ఉంటూ ఆయన అడుగుజాడల్లో మసలుతున్న దుర్గా ప్రసాద్ తమ వర్గానికి ఒక అవకాశం కల్పించవచ్చు కదా? అని భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చర్చించుకుంటున్నారు. అంతేకాక గతంలో తాను వార్డు కౌన్సిలర్‌గా సమర్థవంతంగా పని చేసారు కాబట్టి రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లలో తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్లు కూడా చర్చ జరుగుతుంది. నామినేటెడ్ పదవుల కేటాయంపు శాసనసభ్యునికి కత్తిమీద సాములా మారింది.మరి శాసనసభ్యుడు తన పార్టీ వర్గియులను ఎలా బుజ్జగిస్తారో ఏమో?



## తేనేటీగలు దాడిలో వ్యక్తి మృతి!

**శాంతిపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**
మండలంలోని గుండిశెట్టిపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి అలియాస్ గాంధీ అనేవ్యక్తి ఆదివారం మధ్యాహ్నం తేనెటీగలు కరవడంతో తీవ్రంగా గాయపడిమృతి చె ందాడు. మరో పదిమంది ఆస్పత్రి పాలయ్యారు. ఈసంఘట నకు సంబంధించి స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. గ్రామస్తులు పలువురు మునిదేవర నిర్వహణ కోసం స్థానిక ంగా ఉన్న మునస్వామి మామిడితోటకు వెళ్లారు.అక్కడ ఒక్కసారిగా తేనేటీగలు వచ్చి ప్రజలను కరిచాయి. దీంతో గాంధీ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా అభిలాష్ (28), కీరతన (27),భాస్కర్ (63),సురేష్ (51)అనే వారు గాయపడగా వారిని చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. వీరితో పాటు మరో పదిమందిని సైతం తేనేటీగలు కరచిగాయపరచినట్లు తెలిపారు.

## రైతులు ఇ -పంట నమోదు చేసుకోవాలి:డిఎఒ

**వి.కోట, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండలంలో పంటలసాగు చేస్తున్న ౖతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇ-పంట కింద పంటలసాగు వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసా యాధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఆయనర మండలంలోని బోడిగుట్టపల్లి, పత్రపల్లి గ్రామాల్లో ఇ -పంట నమోదును పరిశీలిం చారు. రైతులు ఇ -పంట నమోదు చేసుకోకుంటే పంటల బీమా వచ్చే అవకాశం లేదన్నా రు. ఈ విషయంలో రైతులు తగు జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ అప్పోజి, సిబ్బంది పాల్గొన్నారు.

## గిడిగి జలపాతంలో పడి వ్యక్తి మృతి

**వి.కోట, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండలంలోని యాలకల్లు సమీపంలోని గిడిగి జలపాతంలో ప్రమాదవశాత్తు పడి ఓవ్యక్తి మృతి చెందాడు. మండలంలోని చిన్నాగనపల్లికి చె ందిన శ్రీనివాసులు (45) ఆదివారం గిడిగి జలపాతంను చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, అగ్ని మాపక అధికారి మనోరంజన్, ఫైర్‌సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకుని గాలించి జాడ కనుగొని శ్రీనివాసులును పైకి తీశారు.అప్పటికే శ్రీనివాసులు మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. జలపాతాల వద్ద,చెరువులు, కుంటల వద్ద ప్రజలుజాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

## సమాజానికి ఉపాధ్యాయుడు దీప స్థంభం

**సదుం, అక్టోబర్ 5 ప్రభాతవార్త**



సమాజానికి ఉపాధ్యాయుడు దీపస్తంభం లాంటివాడని ఎంఈఓ జీఎన్ రాజన్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సదుం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే విద్యార్థుల జీవితం ప్రకాశ వంత మవుతుందని మంచి భవిష్యత్తు ఏర్పడుతుంది అని అభినందించారు . ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, పాల మంద ప్రధానోపాధ్యాయులు నిరంజన్ జడ్పీ హైస్కూల్ హెచ్.ఎం. అఫ్జల్ రాష్ట్ర ఉపాధ్యాయ నాయకులు మోహన్ కుమార్ రెడ్డి, సుధాకర్ మండల ప్రెసిడెంట్ కిషోర్ కుమార్, కృష్ణమూర్తి, వినోద్, మరియు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అత్యున్నత శిఖరం గురువు

**పుంగనూరు అక్టోబర్ 5 ప్రభాతవా ర్త**




ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించారు. వృత్తిలో ఉంటూ వివిధ సామాజిక సేవా కార్యక్రమా లు నిర్వహిస్తున్న వారిని శాలువతో సన్మానించి మెమొంటోలు బహు కరించారు. అధ్యక్ష కార్యదర్శులు నానబాల గణేష్, సిఎస్ రాజారెడ్డిలు మాట్లాడుతూ, ప్రపంచంలోనే గురువులది ఒక ప్రత్యేక స్థానమని, వివిధ రంగాలలో గొప్ప వ్యక్తులుగా ఉన్నటువంటి ప్రతి వ్యక్తి ఒక గురువు దగ్గర శిష్యుడేనని వారిని ఈ విధంగా సన్మానించుకోవటం బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్ కుమార్, సుధాకర్ రెడ్డి,భాస్కర జెట్టి, అనిల్ కుమార్, మునిరాజా , ఆవుల హరిప్రసాద్ , సురేష్, సత్య చారి, వేణుగోపాల్, భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్ రాజు, రవి కిషోర్ , పాల్గొన్నారు.

## మదనపల్లి జిల్లాగా ప్రకటించండి

**పుంగనూరు రూరల్ అక్టోబర్ 5 ప్రభాతవార్త**



మదనపల్లి ను వెంటనే జిల్లాగా ప్రకటిం చి ప్రభుత్వం తను ఇచ్చిన మాటను నిలుపుకోవాలని పలువురు సూచించారు. ఆదివారం పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రభుత్వం జిల్లాలను ప్రకటించడంలో జపం చేస్తుందని పలువురు వ్యాఖ్యానించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకుడు విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కూటమి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే ప్రజలను ఆర్థిక సంక్షేమం నుంచి బయటకు తీసుకు వస్తోందన్నారు. ప్రజలకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ప్రభుత్వం నిలదొక్కుకుంటుందన్నారు. ప్రభుత్వానికి ఇంకా కాస్త సమయం కావాలని, ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్న ప్రజా సమస్యలు ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరూపిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిన ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్సీ

**రామకుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**
రాష్ట్రంలోని 2.90లక్షలమంది ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకున్న సిఎం చంద్రబాబు నాయుడు వారికి 435కోట్ల రూపాయల సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. వైకాపా పాలనలో ఆటో డ్రైవర్లకు గుంతలరోడ్లు, పోలీసులు, నేతల బెదిరింపులు ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వం 1400కోట్లతో రోడ్లను మరమ్మతులు చేసిందన్నారు. ఆటో డ్రైవర్లకు రోడ్ ట్యాక్స్ లేకుండా చేశారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుతో ప్రజలుసంతోష ంగా ఉన్నారన్నారు.

## ఉపాధ్యాయుల గొప్పదనం పరిఢవిల్లాలి

**తవణంపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



సమసమాజ నిర్దేశకులు ఉపాధ్యాయు లేనని, ఉపాధ్యాయుల గొప్పతనం పరిఢవిల్లాలని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ హేమలత ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవంనను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేని సమాజాన్ని ఊహించలేమని, మానవజీవితంలో పంచభూతాలు ఎంత అవసరమో మానవ మనుగడకు ఉపాధ్యాయులు కూడా అంతే అవసరమన్నారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, అరగొండ సింగిల్ విండో ఛైర్మన్ రంజిత్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ప్రవీణ్, కో కన్వీనర్ కంప్యూటర్ శివ, నాయకులు పట్నం గోపియాదవ్, మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కోడి పందెం రాయుళ్ళ అరెస్టు

**పెనుమూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని తిరుగు రెడ్డిపల్లి పంచాయతీ విడిదిపల్లి గ్రామ సరిహద్దులో శనివారం పెనుమూరు పోలీసులు కోడి పందెం స్థావరంపై దాడి చేసి 10 మందిని అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటనరసింహ వెల్లడించిన వివరాల మేరకు విడిదిపల్లి గ్రామ సరిహద్దులో కోడి పందెలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో తనతో పాటు సిబ్బంది అక్కడికి వెళ్ళి దాడి కోడిపందెం స్థావరంపై దాడి చేయడం జరిగిందన్నారు. వీరితో పాటు ఐదు కత్తులు, నాలుగు కోళ్ళు, 15 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు పది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కలెక్టర్

**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. అలాగే డివిజనల్ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరై ప్రజల నుండి సమస్యలను స్వీకరించి వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## నేడు జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డుల పంపిణీ : కలెక్టర్

**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
జిల్లా స్థాయి స్వచ్ఛాంధ్ర అవార్డులు సాధించిన వారికి చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అవార్డులను అందిస్తారని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు, చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుండి జరిగే ఈ కార్యక్రమానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరెడ్డితో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు. అలాగే జిల్లాకు రాష్ట్ర స్థాయిలో 6 అవార్డులు వచ్చాయని వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం విజయవాడలో సంబంధిత అధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు.

## నేడు పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం నుండి ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు : కడ పి.డి.

**కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**
నియోజకవర్గ స్థాయిలో ప్రతి సోమవారం కుప ్పంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆరవతేది అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు.

## టిటిడి జెఇఒ తండ్రి మృతి పట్ల ఘన నివాళులు

**కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) జెఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం చలమయ్య దశ దిన కర్మలకు టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం దంపతులు హాజరై చలమయ్య చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు.

## మాజీ సర్పంచ్ సికె మణికి మాతృవియోగం

**కుప్పం, అక్టోబర్ 5ప్రభాతవార్త:**



పైపాళ్యం మాజీ సర్పంచ్ సికె సుబ్రమణ్యం (సికె మణి) తల్లి రాజమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పైపాళ్యంగ్రామం చేరుకుని రాజమ్మ మృతదేహానికి ఘన నివాళులు అర్పించారు.మాజీ ఎంపిపి వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీదుర్గాదేవికి ప్రభుత్వ కంచర్ల ప్రత్యేక పూజలు

**కుప్పం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



దసరా శరన్నవ రాత్రులను పురస్కరించుకుని స్థానిక శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయంలో శ్రీ దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించిన విషయం విదితమే. ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ అమ్మవారికి ప్రత్యేక పూజలుచేశారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్‌సురేష్‌బాబు, కడ పిఎసి సభ్యుడు రాజ్‌కుమార్, గంగమ్మగుడి కమిటీ సభ్యులు జయరాం నాయుడు, నరేష్, పవన్ మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 13లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణం

**శాంతిపురం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండలంలోని వడగాండ్లపల్లి ఎస్సీ కాలనీలో పదమూడు లక్షల రూపాయల తోనూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం తెదేపా నేతలు భూమిపూజ చేసి పనులుప్రారంభించారు. ఈసందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేతలు శివశంకర్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మిథున్‌రెడ్డిని కలసిన కళ్యాణ్ భరత్

**చౌడేపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథు న్‌రెడ్డిని రాష్ట్ర వైకాపా విద్యార్థి విభాగ సం యుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్ కలిశారు. అక్రమ కేసులో కడిగిన ముత్యంలా బయటకు వచ్చాడని కళ్యాణ్ భరత్ అన్నారు. అనంతరం దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. సోషియల్ మీడియా జిల్లా కార్యదర్శి నాగేంద్రయాదవ్, నాయకులు మల్లికార్జున, మోహన్‌యాదవ్‌లు మిథున్‌రెడ్డిని కలసినవారిలో వున్నారు.

## పలమనేరు పరిరక్షణ సమితికి స్వచ్ఛ-ఆంధ్ర అవార్డు

**పలమనేరు టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



పలమనేరు పరిరక్షణ సమితి (పిపిఎస్)కి జిల్లా స్థాయి ఉత్తమ స్వచ్ఛ-ఆంధ్ర అవార్డు లభిం చింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రకటించారు. ఈ నెల 6న చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోవాలని ఆహ్వానం పంపారు. పలమనేరు పట్టణంలో పారిశుద్యం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా విశేష సేవలు అందిస్తున్నందుకు ప్రజా ఉద్యమాలు, ప్రజల్లో చైతన్యం కలిగించినందుకు పలమనేరు పరిరక్షణ సమితికి ఈ మేరకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు 2025 లభించింది. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్‌జిఓ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పిపిఎస్ గౌరవ అధ్యక్షుడు ఆనందబాబు, కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ఈ అవార్డు పలమనేరు ప్రజలకు అంకితమిస్తున్నామని ప్రజల మద్దతు, పిపిఎస్ కార్యవర్గం, సభ్యుల సమిష్టి కృషికి దక్కిన గౌరవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం పిళ్ళై, సీతారామయ్య, విజయకుమార్, పొన్ముడి, రామచంద్ర, సన్నీరాజు తదితరులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న బొమ్మిదొడ్డి పాఠశాల

**పలమనేరు టౌన్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**
మున్సిపాల్టీ పరిధిలోని బొమ్మిదొడ్డి పాఠశాల ఆవరణ చెరువును తలపిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీరు నిండిపోయి దుర్గంధం వ్యాపిస్తోంది. విద్యార్థులు ఈ నీటిలోనే నడచి తరగతి గదులకు వెళుతున్నారు. పాఠశాల ఆవరణ చుట్టుపక్కల ఎత్తుగా ఉండడం భారీ వర్షాలు పడితే బయటకు నీరు వెళ్ళే అవకాశం లేక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు పాఠశాల ఆవరణలో నీరు నిండిపోవడంతో మధ్యాహ్న భోజనం కూడా వరండాలోనే వండుతున్నారు. అధికారులు దీనిపై స్పందించి ఆవరణలో నిలిచిన నీరు బయటకు వెళ్ళే ఏర్పాట్లు చేయాల్సి వుంది.

## చౌడేశ్వరీ అమ్మవారికి సారె సమర్పణ

**యర్రావారిపాలెం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



యర్రావారిపాలెం మండలం, చెరుకువారి పల్లి పంచాయితీ వంకమద్దివారి పల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ మహా కుంబాభిషేకంకు వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సారె సమర్పించారు. అమ్మవారి ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్న హర్షిత్‌రెడ్డిని గ్రామపెద్దలు సాదరంగా ఆహ్వానించారు. అమ్మవారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రావారి పాలెం వైఎస్ఆర్సీపీ మండల కన్వీనర్ నాగార్జున రెడ్డి, తలకోన ఆలయ కమిటీ మాజీ చైర్మన్, మాజీ ఎంపీపీ రేవతి రెడ్డెప్ప రెడ్డి, వైఎస్ఆర్సీపీ నాయకులు హరినాథ రెడ్డి, బాలాజీ నాయుడు, సునీల్, సన్నీ, శ్రీనివాసులు రెడ్డి, లక్ష్మి రెడ్డి, వైఎస్సార్సీపీ కార్యకర్తలు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా చౌడేశ్వరి దేవి ఆలయ కుంభాభిషేకం

**యర్రావారిపాలెం, అక్టోబర్ 5 ప్రభాతవార్త :**



యర్రావారి పల్లె మండలం, చెరుకువారిపల్లె గ్రామపం చాయతీ వంకమద్దివారి పల్లి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మ వారి ఆల యం నిర్మాణం పూర్తి చేసుకున్న సంద ర్భంగా చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో కుంభాభిషేకం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. కుంభాభిషేకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు స్వాగతం పలికారు. ఆలయ కుంభాభిషేకంలో పాల్గొని చౌడేశ్వరి దేవి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రత్యేక పూజలు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి మధు, యూత్ ప్రెసిడెంట్ నిరంజన్, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లూరి దేవి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు శివ రాణి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కుంభ నాగరాజ, రైతు కార్యదర్శి ప్రసాద్ నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిన్నప రెడ్డి, కేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమీషనర్

**కాణిపాకం, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



రాష్ట్ర సమాచార కమీషనర్ చావలి సునీల్ ఆదివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వా మివారిని దర్శించుకున్నా రు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆల యంలో రాజగోపుం వద్ద ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు,అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో వైభవంగా అర్జున తపస్సు

**తవణంపల్లె, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండల కేంద్రం తవణంపల్లెలో జరుగుతున్న 120వ మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం అర్జున తపస్సు కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ధర్మకర్త గుడిసి వెంకటస్వామి, తవణంపల్లె యువజనసంఘంల ఆధ్వర్యంలో గత నెల 23 నుండి మహాభారత యజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా మహాభారత యజ్ఞంలో అతి ముఖ్యమైన ఘట్టమైన అర్జునతపస్సు కార్యక్రమంను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్జున వేషదారి పరమేశ్వరుడిని ప్రార్థిస్తూ పద్యాలు పాడుతూ ఒక్కో మెట్టు ఎక్కారు. అనంతరం వెంట తీసుకెళ్ళిన నిమ్మకాయలు, వీభూది పండ్లను భక్తులపైకి చల్లారు. దీనితో నిమ్మకాయలు, వీభూది పండ్లకోసం భక్తులు ఎగబడ్డారు. అలాగే సంతానం లేని మహిళలు తపస్సు మాను వద్ద వరాల కోసం ప్రార్థించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వహకులతో పాటు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా శ్రీ భక్తకనకదాసు విగ్రహ ఆవిష్కరణ

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

తిరుపతిలో శ్రీ భక్తకనకదాసు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో శ్రీ భక్తకనకదాసు విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథులుగా కర్నూలు రాజ్యసభ సభ్యులు నాగరాజు, ఐఅండ్‌పిఆర్ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర బీసీ వెల్ఫేర్, జౌళిశాఖ మంత్రి సవిత, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న,ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, బెంగుళూరు కనకదాస మఠం శ్రీశ్రీశ్రీ సిద్ధ రామానంద స్వామి, కురబకుల పెద్దలు హాజరయ్యారు. స్థానిక బాలాజీ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రి సవిత అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి మార్గమధ్యలో ఉన్న దివంగత మాజీ



ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి, మహాత్మా గాంధీ విగ్రహానికి, డా. బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీభక్తకనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేశారు. ఆ తర్వాత రామతులసి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు రాష్ట్ర బీసీ వెల్ఫేర్, జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ నాన్నగారి పేరు మీద విగ్రహం వితరణ ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. నీకు ఏ అవసరం ఉన్న మునుముందు సహాయం అందించడానికి వెనుకాడ బోనని తెలియజేశారు. రేవన్న మాట్లాడుతూ కురుబ భవన్ మంజూరు చేసుకుంటే భవనంకు కావలసినవన్నీ సమకూరుస్తానని హామీ ఇచ్చారు. శ్రీ శ్రీ సిద్ధ రామానంద స్వామి మాట్లాడుతూ అక్కడ భక్త కనకదాసు ఉంటాడని కొనియాడారు. తిరుపతి శాసనసభ్యులు అరణి శ్రీనివాసులు పడుతూ మీకు ఏ అవసరం ఉన్నా నేను ముందు ఉంటానని, నా సహాయం మీకు అందిస్తానని తెలిపారు. ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ కనకదాసు విగ్రహం తిరుపతిలో ఏర్పాటు చేయడం పరిణామంగా భావిస్తున్నానన్నారు. కురుబ, కురవ, కురుమ కుల పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరైన అతిథులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నాము అని తిరుపతి భక్త కనకదాస విగ్రహ ఆవిష్కరణ కమిటీ పెద్దలు తెలియజేశారు.

# తిరుపతి డివిజన్

## వర్షం వస్తే రామానుజపల్లి రోడ్లని జలమయం

**– పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగానే ఇండ్లముందర నీరు**



**తిరుపతిరూరల్, అక్టోబర్5 ప్రభాతవార్త:**

వర్షం వస్తే చాలు రామానుజల్లి రోడ్లన్ని జలమయం అవుతున్నాయనే అనడంలో ఎలాంటి సందేహం లేదు. రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో స్థానికులు ఇంటినుండి అడుగు బయటపెట్టలేక పోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిరుపతిరూరల్ మండలం రామానుజపల్లిలో వర్షాపు సీజన్ మొదలయ్యేసరికి, ఉపయోగకరంగా ఉండాల్సిన రోడ్లు, వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవడాన్ని పలుమార్లు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్ళిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీరు వెళ్ళటానికి ప్రత్యమ్నాయ మార్గం చూపనందునే ఎక్కడికక్కడ వర్షపు నీరు నిలిచిపోతుందని స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారి స్పందించి వర్షపు వెళ్ళటానికి ప్రత్యేక మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రోడ్లపై వర్షపు నీరు అలానే ఉంచితే మురుగునీరుగా మారి, దోమలకు అవాసాలకు నిలయంగా మారనున్నాయని స్థానికులు అంటున్నారు.

## నిరుపేదలను సిఎం సహాయ నిధి ఆదుకుంటుంది

**శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



సమాజంలో వివిధ కారణాలతో ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొన్న బాధితులకు సిఎం సహాయ నిధి ఆదుకుంటుందని బొజ్జల బృందమ్మ అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని పలువురికి సిఎం సహాయనిధి నఉంచి ఆర్థిక సహాయం అందించారన్నారు. ఈ చెక్కులను బృందమ్మ ఆదివారం మండలంలోని పలు గ్రామాలకు వెళ్ళి వారి ఇళ్ళ వద్ద చెక్కులను అందించారు. నిరుపేదలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చరిత్రలో నిలుస్తారన్నారు.ఆమెతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

## గిరిజనులకు జనసేన అండ

**తొట్టంబేడు,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అండగా ఉందని తొట్టంబేడు మండలంలోని జనసేన పార్టీ నాయకులు పేట బ్రదర్స్ వివరించారు. గతంలో గంధం శ్రీనివాసులు సారధ్యంలో పొయ్య పంచాయతీలో పర్యటించినపుడు గిరిజనులు పలు సమస్యలను వివరించారు. వారి సమస్యల్లో ప్రధానంగా ఆధార్‌కార్డులు లేకపోవటంతో రేషన్‌కార్డులు ఇవ్వలేదని దాంతో తమకు రేషన్‌బియ్యం, నిత్యావసర సరకులు అందలేదన్నారు. దాంతో బాధితులను సచివాలయానికి తీసుకెళ్ళి కార్డుల తయారికి ప్రయత్నించారు. రేషన్ కార్డులు ఏర్పాటు చేసే లోపల తమను కాపాడుకోవాలని కోరారు. దాంతో ఆదివారం జనసేనకు చెందిన పేట బ్రదర్స్ గిరిజనులకు 400కిలోల బియ్యం మహిళలకు బట్టలు పిల్లలకు తినుబండారాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, చిరంజీవి,గంధం శ్రీనివాసులు,మణి, దినేష్, ప్రదీప్‌కుమార్,పసల సురేష్, లక్ష్మణ్, మహేష్, కల్లిపూడి వెంకటేష్, మునిచంద్ర, గోపి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జాతీయ తపాలా వారోత్సవాలు

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

సోమవారం నుంచి ఈనెల 11 వరకు జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఐపిఒ బాలాజి ఆదివారం మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరించారు. ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక క్యాంపుల ద్వారా వివిధ సేవల గురించి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ అంతటా పొదుపు పథకాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఇండియాపోస్ట్ పేమెంట్స్ ఖాతాలు ప్రారంభించబడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రతి పోస్టాఫీసు పరిధిలో 'జాతీయ తపాలా వారోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ఖాతాలు ప్రారంభంపై క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.తపాలా పొదుపు పథకాలపై వడ్డీ శాతం గురించి వివరించారు. ఈ నెల 7న ప్రతి పోస్టాఫీసులో పొదుపు ఖాతాలను తెరుచుటకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 8న బీమా పాలసీలపై దృష్టి, 9న ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా 10 సంవత్సరాల లోపు బాలికల కోసం సుకన్య సమృద్ధి పథకాలు ప్రారంభానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వివరించారు. ముఖ్యంగా 2.0జి టెక్నాలజీ దేశ వ్యాప్తంగా అన్ని తపాలా శాఖ కార్యాలయాల్లో ప్రవేశపెట్టినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శ్రీకాళహస్తి ప్రధాన తపాలా కార్యాలయ వేళలను సాయంత్రం ఐదుగంటల వరకు పొడిగించినట్లు బాలాజి వివరించారు.

## నవ సమాజ ఫెడరేషన్ ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా తలారి

**కేవీబీ పురం, అక్టోబరు 5 ప్రభాతవార్త:**

నవ సమాజ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) నూతన ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం, పెరిందేశ గ్రామానికి చెందిన ఉన్నత విద్యావంతుడు తలారి సూరిబాబును నియమించినట్లు ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎఫ్ సంస్థ అందరికి విద్యా, వైద్యం, ఉపాధి లక్ష్యాలుగా 2011సంవత్సరంలో తిరుపతి ప్రారంభమైన సంస్థ నేడు అనేక రాష్ట్రాల్లో జాతీయ స్థాయిలో ప్రాతినిత్యం వహిస్తున్నదని తెలిపారు. నేడు నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన తలారి సూరిబాబును ఎన్ఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.నందిని, రాయలసీమ అధ్యక్షులు ప్రభావత్, భరత్ నాయక్ తదితరులు అభినందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్ర అధ్యక్షుడు తలారి సూరిబాబు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి బాధ్యతలను నెరవేరుస్తూ ప్రజలకు సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తామని అందుకొరకు సామాజిక భావజాలం కలిగిన యువత ముందుకొచ్చి జిల్లాల వారిగా కమిటీలలో నాయకత్వ బాధ్యతలు చేపట్టి భాగస్వామ్యం కావాలని కోరారు. నాకు రాష్ట్ర బాధ్యతలు ఇచ్చిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పుట్టాలమ్మ పొంగళ్ళు

**శ్రీకాళహస్తి రూరల్ అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



మండలంలోని తొండమాన్‌పురంలో పుట్టాలమ్మ ఎల్లమ్మవార్ల దేవాలయంలో గ్రామ దేవత పొంగళ్ళ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమిళనాడులోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తండోప తండాలుగా కదలి వచ్చారు. తొండమాన్‌పురం (ఎగువవీధి, దిగువవీధి) చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు.ఉదయం నుంచి భక్తిశ్రద్దలతో మహిళా భక్తులు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి నైవేద్యం చేసి హారతులను అందించారు. అనంతరం అమ్మవారి గుడి ప్రాంగణంలో అమ్మవారి బొమ్మగీసి గంగ పెట్టి దానికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు చేశారు.ఇలా చేయడం వలన గ్రామంలోని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని గ్రామస్తుల నమ్మకం. అదేవిధంగా రాత్రి కూడా అమ్మవారికి ప్రత్యేకాలంకరణ లతో అమ్మవారి గ్రామోత్సవం ను కన్నుల పండువగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల నాయకులు కామేష్‌యాదవ్, శేఖర్‌రెడ్డి, వెంకట్రాయలు, బర్రె పార్థసారధి, బాలసుబ్రమణ్యం,యోగానంద్,ఆలయ పూజారి మణి తదితరులున్నారు.

## శివయ్య సేవలో కర్నాటక జడ్జి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరుని ఏసేవ లో ఆదివారం కర్నా టక హైకోర్టు జడ్జి జస్టిస్ గీతాక దాబభారతరాజా సెట్టర్ కుటుంబసమేతంగా పాల్గొ న్నారు. వారికి ప్రోటోకాల్ మేరకు దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ మోహన్ ఎపిఆర్ఒ రవిలు వేదపండితులతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు, ఎపిఆర్ఒ శ్రీనివాసులు స్థానిక కోర్టు సిబ్బంది పర్యవేక్షించారు.

## సిద్ది వినాయకస్వామి విగ్రహ ప్రతిష్ట

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్‌డికె నగర్‌లో వెలసిన నూతన ఆలయంలో సిద్ది వినాయక స్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నాగాలమ్మ వీధిలో నిర్మించిన ఆలయ కుంబాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరా లయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. హోమాల తరువాత పూర్ణాహుతి జరిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కలశాద్వొసన గావించారు.ఆ నీటితో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో కమిటి కి చెందిన బాలిశెట్టి నరసింహులు, వేలు,అమర్‌నాథ్, చిరంజీవి, రజనీకుమార్, మాధవ, వెంకటేష్, రామయ్య, మోహన్‌కుమార్, బాలా, చిరంజీవి, భాస్కర్ పర్యవేక్షించారు.

## జనసేన బలోపేతానికి... యువకుల చేరిక

**తొట్టంబేడు,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన పార్టీ బలోపే తానికి పార్టీ నాయకుడు జనసేన పిలుపుమేరకు



యువతను పార్టీలో చేర్చు కుం టున్నారు.ఈ మేరకు ఆదివారం శ్రీకాళహస్తీ_శ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా ప్రటించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కార్యదర్శి కొట్టేసాయి సారధ్యంలో పలువురు యువకులు పార్టీ సభ్యత్వాన్ని తీసుకొని కండువా కప్పుకున్నారు. సుమారు వంద మందిని పార్టీలో చేర్చుకున్నట్లు సాయి వివరించారు. పార్టీ నాయకుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు ప్రకటించారు. తొట్టంబేడు మండలం కొణతనేరి నుంచి బాలాజి సారధ్యంలో 60 మంది తొట్టంబేడు నుంచి బాలు నేతృత్వంలో మరో 50 మంది పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. పార్టీ నాయకుని పిలుపు యువతకు ఉత్సాహాన్ని నింపిందని కొట్టేసాయి అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పోరాడుతున్న జనసేనకు యువత చేరటం కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని అన్నారు.

## ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించండి!

**కేవీబీ పురం, అక్టోబరు 5 ప్రభాతవార్త:**

పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రిగా మీకు పలు మార్లు మండల కేంద్రమైన కేవీబీ పురంలో ప్రభుత్వ షెడ్యూల్ కులముల బాలుర హాస్టల్‌ని ప్రారంభించండి అని తెలిపినా ఇంత వరకు స్పందించలేదని ఆరోపిస్తున్నారు. గత విద్యా సంవత్సరం చివరి నెలలో ప్రారంభిస్తామని తెలిపినా, ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభమై కూడా మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండలంలో 10 ఉన్నత పాఠశాలల నుంచి మండల కేంద్రంలో హాస్టల్‌లో చేరుందుకు సుమారు 268 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎదురుచూస్తున్నామని విద్యార్థులు ప్రభాతవార్త విలేకరికి తెలిపారు. ఆ హాస్టల్‌ను పట్టించుకోనందుకు విద్యార్థులు ఉన్నా లేరని రాసేశారని తెలిపారు. బయోమెట్రిక్ విద్యార్థులు ఉన్నా సమయాన్ని కరెంటు లేకపోవడంతో అప్పటి పరిస్థితుల్లో విద్యార్థులు లేరని అదొకకారణమని చెబుతూ మూసేశారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీ జిల్లా కలెక్టర్, జిల్లా అధికారుల ద్వారా స్టేట్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వారికి కూడా వినతిపత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. గత 45 సంవత్సరాలుగా ఎస్సీ హాస్టల్‌లో ఎంతో మంది విద్యార్థులు ఆఫీసర్లుగా ప్రిన్సిపాల్‌గా సర్వీసులో పైలెట్లుగా శాటిలైట్‌లో ఇంజనీర్లుగా ప్రభుత్వ శాఖలలో ఆ హాస్టల్ విద్యార్థులు పొందారు. అటువంటి షెడ్యూల్ కులంకు సంబంధించిన హాస్టల్‌లో మరలా పునఃప్రారంభించి హాస్టల్‌గదులను శుభ్రపరచి బాగు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## గురువులకు పూర్వ విద్యార్ధుల ఘన సన్మానం

**చంద్రగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**



తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువు లకు పూర్వ విద్యార్థులు ఆదివారం ఘన సన్మానం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1981 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం బుచ్చినాయుడుపల్లిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమతో పాటు విద్యాభ్యాసం చేసిన విద్యార్థు లలో అశువులుబాసిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేదవిద్యార్థుల విద్యాభివృద్ధికి, పేదరికంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న, అనారోగ్యంతో భాధపడుతున్న సహచరులకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో కొంత మంది తమవంతుగా కొంత నగదును విరాళంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో 1981 బ్యాచ్ ట్రస్ట్ అధ్యక్షుడుగా టి.చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడుగా బాలకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడుగా ఎం.భాస్కర్ రెడ్డి, కార్యదర్శి డి.బి.వెంకటేశ్వర్లు నాయుడు, సహాయ కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, కోశాధికారులుగా మురళీధర్, సుబ్రమణ్యం రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌కుమార్, కేశవులు, సోమశేఖర్, టి.చంద్రశేఖర్, రవిచంద్ర, కిషోర్, గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గోద్రెజ్ ఆగ్రోవెట్ చే మై గ్రేసియా,మై ఫ్రైడ్

**తిరుపతి విద్య, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

ప్రముఖ విభిన్న వ్యవసాయవ్యాపార సమ్మేళనాలలో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రెజ్ ఆగ్రోవెట్),ఇటీవల వ్యవసాయ శ్రేయస్సును పెంచడానికి ఆరోగ్యకరమైన నారుమొక్కల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ మై గ్రేసియా, మై ఫ్రైడ్ అనే పేరుతో దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించిందని ఆ సంస్థ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె తెలిపారు. సరైన సమయంలో గ్రేసియా కీటకనాశినిని చురుకుగావల్ల మిరప,క్యాబేజీ, టమాటో,వంకాయ, ఇతర పంటలలో తెగుళ్లను నియంత్రించడంలో దీర్ఘకాలవ్యవధి,సమర్థతను అందిస్తుంది. వర్షానికి తట్టుకునే అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుందన్నారు.ఈ ప్రచారంలోభాగంగా,రైతులను ప్రోత్సహించడానికి, ఉత్పత్తి ప్రామాణికతపై వారికి అవగాహన కల్పించడానికి కంపెనీ స్పిన్ అండ్ విన్ పోటీని కూడా ప్రవేశపెట్టింది. మార్చి 2026 వరకునడ చేఈపోటీ10భాషలలో ఇంగ్లీష్,హిందీ,మరాఠీ, తెలుగు,కన్నడ, గుజరాతీ,పంజాబీ, ఒరియా, బెంగాలీ, తమిళం అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పండగల సందర్భంగా మరిన్ని ఉత్పత్తులు

**తిరుపతి విద్య, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

ప్రస్తుతం జరుగుతున్న అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సందర్భంగా దేశవ్యాప్తంగా 270కి పైగా పట్టణాలకు అమెజాన్ ఫ్రెషన్ ను విస్తరింపజేసి, ఉత్పత్తులను అందిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ తెలిపారు.తాజా పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు, గృహావసర వస్తుసామాగ్రులు, స్థానికంగా ప్రజలు మెచ్చిన వస్తువులతో సహా దైనందిన అవసరాలకు కావలసిన వస్తువులను భారతదేశ వ్యాప్తంగా లక్షలాది కస్టమర్లకు అందుబాటులోకి తీసుకురావటానికి అమెజాన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. నెల్లూరు,హస్సన్,కొడగు, వరంగల్, విజయనగరం, వెలూరు,తిరుపతి, కొట్టాయం, కోళ్ళం, హుబ్లి పట్టణాల్లో ఒక సేవలు విస్తరించాయి అన్నారు. అమెజాన్ ఫ్రెష్ విక్రేతలు 40,000లకు పైగా ఉత్పత్తులతో కూడిన ఒక సమగ్రమైన సెలక్షన్ ను ఎంచుకోవాలి అని తెలిపారు.ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

## కెనరా రోబెకో ఏఎంసిచే నివేశ్ బస్ యాత్ర

**తిరుపతి విద్య, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (కెనరా రోబెకో ఏఎంసి) ఈరోజు నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో దాదాపు నెల రోజుల పాటు నిర్వహించనున్న పెట్టుబడిదారుల విద్యా కార్యక్రమం నివేశ్ బస్ యాత్ర ను ప్రారంభించింది.ఈ బస్సు తిరుపతిలో తన ప్రయాణాన్ని ప్రారంభించింది.ఇది కర్నూలు,అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు,విజయవాడ, విశాఖపట్నం మీదగా ప్రయాణించి,ప్రతి నగరంలోని స్థానిక నివాసితులకు పెట్టుబడిదారులకు అవగాహన కల్పిస్తుంది. ఈ సందర్భంగా సంస్థ సిఈఓ రజనీష్ నరులా మాట్లాడుతూ నేటి ఆర్థిక రంగంలో,విజ్ఞానం అనేది అవగాహనలా శక్తివంతమైనది.తగిన సమాచారం ఉన్న పెట్టుబడిదారుడు తమకు తాముగా మెరుగైన నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, విస్తృతస్థాయిలో ఆర్థిక పర్యావరణ వ్యవస్థను కూడా బలోపేతం చేస్తాడు.పెట్టుబడి జ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి, ఆచరణీయంగా మార్చడానికి మేము కట్టుబడి ఉన్నాము" అని తెలిపారు. నివేశ్ బస్ యాత్ర ఆర్థిక విద్యను సమాజాలకు నేరుగా తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ గౌరవ్ గోయల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

## నకిలీ జెఎస్డబ్ల్యు సిల్వర్ ఉత్పత్తులను నమ్మకండి

**తిరుపతి విద్య, అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో నకిలీ జెఎస్‌డబ్ల్యూ సిల్వర్ ఉత్పత్తులు విక్రయిస్తున్నారని, వాటిని వినియోగదారులు నమ్మకండి అని ఆ సంస్థ ప్రతినిధి మహేష్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో జెఎస్‌డబ్ల్యూ స్టీల్ కోటెడ్ బృందం నకిలీ జెఎస్‌డబ్ల్యూ సిల్వర్ పూత కలిగిన షట్టర్ ఉత్పత్తులను పసిగట్టిందని,స్థానిక పోలీసులతో సంయుక్తంగా నిఘా పెట్టి ఎస్ డిఎస్ అండ్ సన్స్‌పై దాడి చేసి 18 నకిలీ ఉత్పత్తులు, ఎచింగ్ మోల్డ్ స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. ఐపిసి, ట్రేడ్‌మార్క్ చట్టం సెక్షన్ల కింద నిందితులపై కడప తాలూకా పీఎస్ లో సెప్టెంబర్ 12, 2025న ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. నకిలీ ఉత్పత్తుల ముప్పు నుండి కస్టమర్లను, బ్రాండ్ సమగ్రతను రక్షించడానికి జెఎస్‌డబ్ల్యూ స్టీల్ తమ నిబద్ధతను పునరుద్ఘాటించిందని తెలియజేశారు. వినియోగదారులు నకిలీ బ్రాండ్ వస్తువులు నమ్మవద్దని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అపారం : బృందమ్మ

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త:**

హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ నాలుగు సంవత్సరాలుగా చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించిన పాట క్యాసెట్‌ను ఆదివారం మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆవిష్కరించారు. పట్టణంలోని కొత్తపేట వివేకానంద పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆమె ముఖ్యఅతిథిగా మాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా అతిధులను స్వాగతం పలికారు.ఎలాంటి విరాళాలు ఆశించకుండా వికలాంగులకు ప్రతి నెల తన సొంత సంపాదనపై వచ్చిన లాభాల్లో కొంత అందించిన మునీర్‌బాషా సేవలకు సంబంధించి కొత్త పాటను రికార్డింగ్ చేసారు.ఈ పాటను బృందమ్మ ఆవిష్కరించారు.దీనిని



దివ్యాంగులతో పాటు హాజరైన సభికులకు అందజేసారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ తాను ఎన్నో స్వచ్ఛందసేవా సంస్థలను చూసానని అయితే ప్రతి ఒక్కటి లాభాపేక్షతోనే సాగుతుంటాయని కానీ హెల్పింగ్‌హ్యాండ్స్ అధినేత మునీర్‌బాషా మాత్రం ఎలాంటి లాభాపేక్ష, విరాళాలను సేకరించకుండా నిర్వహించటం ఆయన సేవా నిరతికి నిదర్శనం అని అభినందించారు.అయితే ఇలాంటి మహోన్నతమైన ఆశయంతో నిర్వహిస్తున్న సంస్థలో దివ్యాంగులకు సేవలందించే భాగ్యంను పలువురికి కల్పించాలని బృందమ్మ సూచించారు.ఈ నేపథ్యంలో తన వంతు ఆర్థిక సహాయాన్ని రూ.లక్ష అందజేస్తానని దానిని దివ్యాంగుల సేవలకు వినియోగించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల అధినేత జితేంద్ర, మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షులు రంగినేని చెంచయ్య నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్,మైనారిటి నాయకులు షాకీర్ అలి,గరికపాటి రమేష్,మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వార్త CLASSIFIEDS వార్త

CHANGE OF NAME

★ నేను, పూల సుబ్రమణ్యం, పూల కిషిత యొక్క తండ్రి, చిరుదూరం చిత్తూరు జిల్లా నివాసి, ఇక్కడ తెలియజేస్తున్నాను, నా కుమార్తె పూల కిషిత యొక్క పేరును పూల కార్తీక గా మార్చాను.

(Ro.No.25178)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# నా విజయానికి ఎంతో సహకారం అందించారు: ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: నా విజయానికి బ్రాహ్మణులు ఎంతో సహకారం అందించారని, పేద బ్రాహ్మణుల కొరకు మంచి కళ్యాణ మండపం నిర్మించి అన్ని వసతులు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన కళ్యాణ మండపంలో ఆధునీకరణ పనులు పూర్తయ్యి వీటిని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. అభివృద్ధి పనులకు సహాయం అందించిన దాతలను ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే ఎమ్మెల్యేని మరియు డాక్టర్ జనార్దన్ రెడ్డిని శిరోమణి శర్మ ఆశీర్వాదం చేసి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా పూర్తి అవ్వాలంటే సమర్థుడైన వ్యక్తి ఉండాలని బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు శివకుమార్ ఎంత ఉత్సాహంగా దాతల నుండి సహాయం పొంది కళ్యాణ మండపం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సంఘ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ డాక్టర్ జనార్దన్ రెడ్డి, రోహిణి దంపతులు ఎనిమిది లక్షల రూపాయలు మొట్టమొదటిగా సహాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శిరోమణి శర్మ, డాక్టర్ జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రామ్ మూర్తి, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు, కోశాధికారి ఉద్య లలిత, కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, చెన్నూరు పద్మావతి, శ్రీనివాస్ కుమార్, అశోక్ కుమార్, నారాయణమూర్తి, వెంకట సుబ్బారావు, రాజా, చైతన్య ప్రసాద్, వంశీకృష్ణ, ప్రసన్న కుమార్, ముని గిరీష్, బాలకృష్ణ రాజు, శ్రీకాంత్ రెడ్డి, పుట్టా శంకరయ్య వల్లంకొండ వెంకట సుబ్బయ్య, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాధనాల శ్రీనివాస్ చౌదరికి డాక్టరేట్ ప్రధానం



బాలాయపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త : వెంగమాంబపురం మాజీ సర్పంచ్ వెంకమనాయుడు తనయుడు సాధనాల శ్రీనివాస్ చౌదరికి శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంధ్రప్రదేశ్ లోని ఎంపిక చేసిన జిల్లాల్లో డిజిటల్ బ్యాంకింగ్ దార్శనికతను ముందుకు తీసుకెళ్లడంలో యూపీఐల పాత్రపై అనుభావిక అధ్యయనంపై డాక్టరేట్‌ను పొందారు. డాక్టరేట్ సాధించినందుకు శ్రీనివాస్ చౌదరిని పలువురు గ్రామస్థులు అభినందించారు. మేనేజ్మెంట్ విభాగంలో పనిచేసిన విశ్రాంత ప్రొఫెసర్ సిఎన్ కృష్ణ నాయక్ మార్గదర్శకత్వంలో డాక్టరేట్ సాధించడం ఆనందంగా ఉందని సాధనాల శ్రీనివాస్ చౌదరి తెలిపారు.

## నేడు జరిగే ఉచిత వైద్య శిబిరం

బాలాయపల్లి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: నారాయణ ఆరోగ్యమస్తు పథకం ద్వారా మన్నూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలకు అందించే లక్ష్యంతో మండల వైసీపీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కాటూరు ప్రసాద్‌రెడ్డి, గ్రామ ప్రజల సహకారంతో ఉచిత వైద్య సలహా శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు నిర్వాహకులు కోరారు. మండల ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వెంకటగిరి మోడల్ మున్సిపాలిటీగా లక్ష్యం : ఎమ్మెల్యే



వెంకటగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: వెంకటగిరి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడం లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను ఆయన చాంబర్లో కలిసి మునిసిపాలిటీ అభివృద్ధికి కావలసిన నిధులను ఇవ్వాలని కోరారు. పట్టణంలో ముఖ్యంగా పంచాయతీ కార్యాలయంలో వేసిన తాగునీటి పైపులు వల్ల ఇబ్బందిగా ఉందని తెలిపారు. తరచూ పైపులు పగిలిపోయి తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీలో సిమెంట్ రోడ్లు వేయించాల్సి ఉందని తెలిపారు. మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రణాళికల నివేదికను అందజేశారు. మున్సిపాలిటీ లో ఉన్న సమస్యలు అన్నింటిని పరిష్కరించి అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అధికారులు పట్టణాల్లో ఉన్న సమస్యలు పరిష్కారంపై దృష్టి సాధించాలని సూచించారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## దళిత సంఘాల నాయకుల ధర్నా



వెంకటగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: పట్టణంలోని ఐదవ వార్డు అమ్మవారిపేట వద్ద పెంచలయ్య, శ్రీనివాసులు, నిర్మించుకొని ఉన్న గుడిసెలను పోలీసులు రెవెన్యూ సిబ్బంది అక్రమంగా తొలగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేశారు. ఎలాంటి ఇల్లు లేని నిరుపేదలైన వారి గుడిసెలను తొలగించడం దారుణమన్నారు. ఈ స్థలం పక్కనే వేరే వారు ఆక్రమించి డాబా నిర్మించిన వారి జోలికి వెళ్లలేదని తెలిపారు. ఇంకా అనేకమంది చెరువుని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిని రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదన్నారు. పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల ఉత్తమ ఉపాధ్యాయుడుగా చెన్నకేశవులు



వెంకటగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యులను ప్రోత్సహించడానికి విఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మేరియ రోజా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభగల ఉత్తమ గురుకుల ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించడమైనది. ఆంధ్రప్రదేశ్ గురుకుల వెంకటగిరి జూనియర్ కళాశాలలో పని చేస్తున్న బోటని లెక్చరర్ డాక్టర్ యం. చెన్న కేశవులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక`య్యారు. ఈయన కొడిగనహళ్లి, గ్యారంపల్లి, వెంకటగిరి ఆంధ్ర ప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో 30 సంవత్సరాలు లెక్చరర్‌గా ప్రిన్సిపాల్‌గా విశేష సేవలు అందించినందుకు మరియు గ్యారంపల్లి జూనియర్ కళాశాలను అభివృద్ధి పరిచి వంద శాతం ఫలితాలు సాధించినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డుల ప్రధానోత్సవం గుంటూరు పట్టణంలోని బ్రాడీపేటలో గుర్రం జాషువా విజ్ఞాన మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగినది. విద్యార్థులకు విశేష సేవలు అందించివారికి అవార్డుల ప్రదానోత్సవం చేయడం జరిగిందని వినుకొండ శ్రీనివాసరావు ఫౌండేషన్ అధ్యక్షులు మేరియ రోజా తెలిపారు. అవార్డు గ్రహీతలను శాలువా, మేమెంటో, సర్టిఫికెట్, పూలదండతో ఘనంగా సన్మానించారు. ఈ కాకర్యక్రమంలో వి ఎస్ఆర్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

## జంట మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించండి



సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త: నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం గూడూరులో నిర్వహించిన మున్సిపల్ శాఖలకు సంబంధించిన సమీక్ష సమావేశంలో ఆమె మంత్రి నారాయణను కలిశారు. సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో యుఐడిఎఫ్, ఎఎంఆర్‌యుడి నిధుల వినియోగంపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు మెరుగుదలకు తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ సమావేశంలో మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యేకి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలోని పలు సమస్యలను మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## లయన్స్ క్లబ్‌లో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం




సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంబేటి శ్రీనివాసులు, శ్రీపతి సురేంద్ర, కృష్ణ మూర్తి, నెల్లూరు భవానిలను లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లలిత, అరుణకుమారి, కోశాధికారి జానకి, ప్రాజెక్టు చైర్మన్ వసుంధర, ఎంఇఓ సునీల, ప్రధానోపాధ్యాయురాలు మృదుల, లయన్స్ క్లబ్ సభ్యులు అప్పారావు, మధుసూదన్‌రెడ్డి, రాధాకృష్ణరావు, హరీష్, శ్రీనివాసులు, ఆదినారాయణరెడ్డి, అంకులరావు, లలితారెడ్డి, సురేష్, రఘురామిరెడ్డి, సంగీత పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి : సిఐటియు



గూడూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: మున్సిపల్ కార్యాలయానికి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను ఆదివారం మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై కలవడం జరిగింది. అనంతరం ఏ.పీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం గూడూరు పట్టణ మున్సిపల్ కార్మికుల కమిటీ నాయకుల ఆధ్వర్యంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌ల సమక్షంలో మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై కలవడం జరిగింది. 12వ పి.ఆర్.సి కమిటీ నియామకం మున్సిపల్ కార్మికులందరికీ జీతాలు పెంచాలి, మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, గూడూరు పట్టణ కార్యదర్శి భూలోక మురళి, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య, అడపాల ప్రసాద్ ఏంబేటి చంద్రయ్య,ఎన్. వెంకటరమణ, బాలాజీ, గిరి, వాసుదేవ్, తదితరులు పాల్గొన్నారు.

## గొప్ప హిందూ సంస్థగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్




గూడూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త: మన భారతదేశంలో గొప్ప హిందూ సంస్థగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా ప్రెసిడెంట్ డిఎ తేజేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది కూటములుగా ఏర్పడింది. భారత్ వికాస్ పరిషత్, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్, శివసేన ఇవి మొత్తం కలిపి తొమ్మిది ఆర్ఎస్ఎస్ సంస్థ వ్యవస్థాపకులు డా.హెడ్గేవార్ గురూజీ లాగా ఎంతోమంది మహనీయులు కృషి చేశారు. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ చీఫ్‌గా ఉన్న మోహన్ భగవత్ జీ కోట్ల మందిని కార్యకర్తల సైన్యంగా ఏర్పాటు చేశారు. ఆయనకు శిరసు వంచి నమస్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సూళ్లూరుపేట, అక్టోబర్ 5 ప్రభాతవార్త : నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆరుగురికి 16 లక్షల 59 వేల 949 రూపాయలను చెక్కుల ద్వారా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అడిగిన వెంటనే చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరికీ సహాయం చేస్తున్నారని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట మున్సిపాలిటీలో ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డును ప్రస్తుతం ఉన్న ప్రదేశంలోనే ఉంచే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గూడూరులో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, ఆయన రాబోయే ఒకటిన్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో డంపింగ్ యార్డులు లేకుండా చేస్తారని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మన్ ఎజి కిషోర్, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పి.మాధవ నాయుడులు పాల్గొన్నారు.

## ఘనంగా శాఖమూరి జన్మదినం



పెళ్లకూరు, అక్టోబర్ 5 ప్రభాతవార్త : మండలంలోని చింత పూడి పంచాయతీ లక్ష్మణ్ నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన తెదేపా నాయకులు శాఖమూరి కృష్ణమనాయుడు జన్మదినాన్ని ఆదివారం నాడు లక్ష్మీ నాయుడు కండ్రిగలోని ఆయన నివాసంలో నిర్వహించారు. టిడిపి మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య మరియు స్వర్ణము నది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో కృష్ణమ నాయుడును పూలమాలు శాలువలతో ఘనంగా సత్కరించి కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదన్మోహన్ నాయుడు సతీష్ రెడ్డి పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## బోయకొండ నిండిన భక్త జనం

**-అమ్మవారి దర్శనానికి 3గంటల సమయం**





బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 5 ప్రభాతవార్త: శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. దసరా పండుగ అయిన తర్వాత తొలి ఆదివారం కావడంతో రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించుకొన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వాహనాలు కొండపైకి రావడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. ఉదయాన్నే ఆలయ అర్చకులు, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## ధర్మకర్తల మండలి సభ్యులను సత్కారం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో అవకాశం లభించిన కాపుసామాజిక వర్గ సభ్యులను ఆదివారం కాపు సామాజిక వర్గంకు చెందిన ఎస్‌వి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి చెందిన కోలా విశాలాక్షి, శ్రీకాళహస్తి మండలం జనసేనకు చెందిన రాఘవయ్యలను పాలకమండలిలో అవకాశం కల్పించటం అభినందనీయం అన్నారు. వారిని దుశ్శాలువలతో పూల మాలలతో సత్కరించారు.కాపు సామాజిక వర్గానికి చెందిన అడపడచు విశాలాక్షికి శివయ్య చిన్న వయస్సులోనే అవకాశం కల్పించారన్నారు.జనసేన పార్టీ అవిర్భావం నుంచి శ్రీకాళహస్తి మండలంలో ఓ ఎపెద్దదిక్కుగా వ్యవహారిస్తూ పార్టీని గ్రామాల్లో విస్తరింపజేయుటకు కృషి చేస్తున్న దండి రాఘవయ్యకు సేవా భాగ్యం కల్గటం హర్షణీయమన్నారు. పాలకమండలి కూర్పులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# డిసెంబర్ 28న బహుజన ఉద్యోగస్తుల ఆత్మీయ సమ్మేళనం



తిరుపతి హెల్త్, అక్టోబర్ 5 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బహుజన ఉద్యోగుల సమాఖ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 28న బహుజన ఉద్యోగస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ గుజ్జేలి తెలిపారు. ఈ సమ్మేళనంకు వేదికగా కె.ఆర్.సి. కాలేజ్ గ్రౌండ్, పాత కేఎల్ఎం హాస్పిటల్ వెనుక జీవగ్రామం గాజుల మండ్యం హైవే సర్కిల్, తూకివాకం పోస్ట్, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా నందు ఉదయం నుండి సాయంత్రం వరకు బహుజన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరుగుతోందని ఆదివారం పత్రికా విలేకరుల సమక్షంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభా అధ్యక్షులుగా హైకోర్టు న్యాయవాది, ఆల్ ఇండియా అంబెద్కర్ యువజన సంఘం, రాష్ట్ర అధ్యక్షులు చింతమాకుల పుణ్యమూర్తి, బహుజన ఉద్యోగస్తుల సమాఖ్య, శ్రీ వెంకటేశ్వర విద్యాలయం, అధ్యక్షులు సంగీతం సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి మొండెం పద్మనాభం, సంయుక్త కార్యదర్శి దార్ల రఘురాములు, అసిస్టెంట్ కార్యదర్శి దాడి తోట ప్రతాప్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. మునీశ్వరయ్య గౌడ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డి. మధుమోహన్ అలాగే ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులు పాల్గొన్నారు. తదితర నాయకులు ప్రసంగిస్తూ గ్రామస్థాయి నుండి దేశ స్థాయి వరకు దళిత బహుజనుల మీద ప్రతినిత్యం ఏదో ఒకచోట దాడులు దౌర్జన్యాలు కుల వివక్షలు జరుగుతున్నాయని వీటన్నిటికీ ముఖ్య కారణం సరైన అటువంటి చదువులు లేకపోవడం, భారత రాజ్యాంగం పట్ల అవగాహన లేకపోవడం ప్రధాన కారణమని ప్రసంగిస్తూ బడుగు బలహీన అణగారిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ, అగ్రకులాలలో పేద వర్గాలను సైతం చైతన్యవంతులుగా చేయటం ముఖ్య ఉద్దేశం అని అందుకు బహుజన ఉద్యోగస్తులు కృషి చేస్తారని అన్నారు.

## సరస్వతి శిశుమందిర్‌లో... ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని సరస్వతి శిశు మందిర్‌లో ఆర్ ఎస్ ఎస్ శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925లో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారని నేటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుందని కోలా ఆనంద్ వివరించారు. దేశ సేవ,అభివృద్ధి, నాగరికత, సంప్రదాయాలను కాపాడుకోవటానికి వంద సంవత్సరాల నుంచి అవిరాళ కృషి చేస్తున్నారని వివరించారు. పార్టీ వందేళ్ళలో ఎంతో మంది ఉత్తములను, నిస్వార్థపరులను దేశ సేవకులుగా మలుస్తూ రాష్ట్రపతిని, ఉప రాష్ట్రపతిని, ప్రధాన మంత్రులను,ముఖ్యమంత్రులను ఎందరో పార్లమెంటు సభ్యులను స్వయంసేవక్ అందించిన ఘనత ఉందన్నారు. దేశంలో ఏ విపత్తు చోటు చేసుకున్నా ఆర్ఎస్ఎస్ నేనున్నాను అని ముందుంటుందన్నారు. అలాంటి పార్టీలో తమలాంటి యువకులు భాగస్వాములు కావటం తమ అదృష్టంగా భావిస్తున్నామని కోలా ఆనంద్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ నాయకుల చిత్రపటాలకు పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, మహిళా మోర్చా జిల్లా ప్రదాన కార్యదర్శి ప్రజ్ఞశ్రీ, సీనియర్లు అమర్‌నాథ్,ఉమాసింగ్, ఇమ్మిడిశెట్టి మోహన్, పుణ్యం డిల్లికుమార్, మద్దువాసు యాదవ్ పట్టణ ప్రధాన కార్యదర్శి చందు రాయల్,ఛోటు, గిరిధర్,సాయి, చైతన్య,రాజా తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సినీ నటులు సుమన్



శ్రీకాళహస్తి,అక్టోబర్ 5 ప్రభాతవార్త: వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సినీనటులు సుమన్ రాహుకేతుదోష నివారణ పూజలు, అభిషేకాలు జరిపించుకున్నారు. ఆయన స్వయంభువు సన్నిధికి రాగా ఆలయాధికారుల ఆదేశాల మేరకు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయనతో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రత్యేక రాహుకేతుదోష నివారణ పూజల టిక్కెట్టును కొనుగోలు చేసి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాట్లు చేసారు. స్వామి అమ్మవార్ల అభిషేకాల్లో పాల్గొన్న ఆయనకు మృత్యుంజయ ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలను ఎపిఆర్‌ఓ రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు



పుత్తూరు రూరల్, అక్టోబరు 5 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా పవిత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ పవిత్ర ఉత్సవాలు రేపటితో ముగిస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం నుంచి సోమవారం వరకు ఉంటుందని వివరించారు. ఉదయం ఆలయంలోని మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు. అలాగే ఆలయంలో కలశస్థాపన ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## వాసునాయుడు ఇంట వైకాపా నాయకుల సందడి



తొట్టంబేడు అక్టోబర్ 5 ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు, తొట్టంబేడు మండల ఎంపిపి ఉన్నం నిర్మలమ్మల కుమారుడు ఉన్నం చరణ్‌సాయి పంచెకట్టు వేడుకను సంబరాలుగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలకు వైకాపా జిల్లా నాయకులు కదలి వచ్చారు. సోమవారం సాయంత్రం పంచెకట్టు కార్యక్రమాలను కళ్యాణమండపంలో ఏర్పాటు చేసారు. అయితే ఆదివారం ఇంటి వద్ద ఓ పండగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమనకరుణాకర్‌రెడ్డి, శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఏ మధూసూదన్‌రెడ్డి పాల్గొని ఉన్నం చెంచు చరణ్‌సాయిని ఆశీర్వదించారు. ఈ వేడుకలో దేవస్థాన మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, కెవిబి పురం మండల వైకాపా నాయకుడు గవర్ల కృష్ణయ్య, కోవి చంద్రయ్యానాయుడు, షేక్.సిరాజ్ బాషా, గంగాధరం,మున్నా సాధనరాయల్, ఉత్తరాజి శరవణకుమార్, రవి, శ్రీను, వెంకీ, రాజా ముదిరాజ్, జివికెరెడ్డి, గిరి, వినోద్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు సిఐ కావలెను..!

**-ఇన్‌చార్జ్ పాలనలో చంద్రగిరి మండల పరిషత్**

చంద్రగిరి, అక్టోబర్ 5 ప్రభాతవార్త: చారిత్రాత్మక చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు పూర్తి స్థాయి సిఐ కావాలి. చంద్రగిరి సిఐ సుబ్బరామిరెడ్డి బదిలీ అయి మూడు నెలలు కావస్తున్నా సిఐ నియామకం జరగలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత మండలంలో భాకరాపేట సిఐ ఇమ్రాన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.యర్రావారిపల్లి, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల పరిధి విశాలం కావడం, రోడ్డుప్రమాదాలు, నేరాలు, హత్యలు, చోరీలు వంటి ఘటనలకు సరిపడా సిబ్బంది లేకపోవడం, తరచూ బందోబస్తులకు వెళ్ళవలసి రావడం వంటి కారణాలు ఇక్కడి సిఐ అవసరాన్ని తెలియజేస్తున్నాయి. పూర్తి స్థాయి సర్కిల్ ఇన్స్పెక్టర్ వచ్చినట్లయితే చంద్రగిరి, ఆర్‌సి పురం రెండు మండలాలకు చెందిన పోలీసులను అప్రమత్తం చేసుకోగలరు. చంద్రగిరి స్టేషన్‌లో సిబ్బంది ఒకరిద్దరు మినహా అందరూ కొత్తవాళ్ళే కావడంతో ఇక్కడి పరిస్థితులను, భౌగోళిక స్థితిగతులను, ప్రజల జీవనశైలిని, రాజకీయ నేపథ్యాన్ని అంచనా వేయడం పెనుసవాల్ కాగలదు. ముఖ్యమంత్రి నారావారిపల్లి రాక నేపథ్యంలో ఏ చిన్న పొరబాటు జరిగినా సంబంధిత అధికారి మూల్యం చెల్లించక తప్పదనేందుకు గతంలో చోటుచేసుకున్న పరిణామాలు ఎవరికైనా ఆందోళన కలిగించకమానదు. చంద్రగిరి పోలీస్ స్టేషన్‌తో పాటు చంద్రగిరి మండల పరిషత్ సైతం ఇన్‌చార్జ్ పాలనలో కొనసాగడం పట్ల ఎంఎల్‌ఏ పులివర్తి నానితో పాటు జిల్లా స్థాయి అధికారులు పునరాలోచన చేయాల్సివున్నది. ఈఓఆర్‌డిగా వున్న వెంకటరత్నంను ఇన్‌చార్జ్ ఎంపిడిఓగా నియమించినప్పటికీ పూర్తి స్థాయి ఎంపిడిఓ ఆవశ్యకతను గుర్తించాల్సివున్నది.